ప్రజాశక్తి

గురువారం 17 అక్టోబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు

గంజాయి సాగు, రవాణా నేరం

ప్రజాశక్తి -అనంతగిరి: గంజాయి సాగు, రవాణా చేయడం నేరమని అనంతగిరి ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం శివలింగపురం ఆశ్రమోన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు డబ్బు వంటి ప్రలోభాలకు గురికావద్దని తెలిపారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో నిషేధిత వస్తువుల జోలికి విద్యార్థిలు వెళ్లకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగహన కలిపిస్తున్న ఎస్ఐ

ప్రజా సమస్యలపై..

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

-జల్ జీవన్ పనులపై దృష్టి సారించాలి-స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగాయి. గ్రామీణాభివృద్ధి, జల వనరులు, గనులు, ప్రజా రవాణా, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు వేయగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు చెందిన బిల్లులు చెల్లించలేదని, ఇదివరకే దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొత్త గృహాలు మంజూరు కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటిని మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరు చేసిన గృహ పథకాలు కొనసాగుతాయని, పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం కూడా జరుగుతుందని అధికారులు ఛైర్‌పర్సన్‌కు వివరించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులపై ఆరా తీసిన ఆమె జెడ్‌పిటిసిలకు సమాచారం ఇవ్వాలని అన్నారు. దీనికి అధికారులు బదులిస్తూ ప్రతి గ్రామసభలో తీర్మానం చేసిన పనులు తప్పక మంజూరవుతాయని, అలాగే గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందిస్తామని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కార్యక్రమంపై దృష్టి సారించి త్వరితగతిన ఆ పనులు పూర్తి చేయాలని సుభద్ర గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన పెండింగ్ కనెక్షన్లు, కొన్ని ప్రాంతాల్లోని ఇతర సమస్యలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి లేవనెత్తిన ప్రశ్నకు బదులిస్తూ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్‌టిసి సంస్థ వివిధ రూట్లలో నిలుపుదల చేసిన బస్సులను పున్ణ ప్రారంభించాలని ఎమ్మెల్యే బండారు సభ దృష్టికి తీసుకువచ్చారు. వచ్చే జెడ్‌పి సర్వ సభ్య సమావేశానికి పూర్తిచేసిన పనుల నివేదికతో హాజరుకావాలని ఛైర్‌పర్సన్ అధికారులను కోరారు. జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన దాదాపు 95 శాతం వరకు పింఛన్లు పంపిణీ జరుగుతోందని అన్నారు. అందుబాటులో లేని మిగిలిన వారికి మరుసటి రోజున పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అప్పటికీ గ్రామాలలో పింఛన్ల విషయంలో ఏమైనా ఇబ్బంది వస్తే స్థానిక ఎంపిడిఒకు తెలియజేయాలని, వెంటనే తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్ పర్సన్ సుభద్ర

మాట్లాడుతున్న గంగరాజు

అన్ని జిల్లాలకు నిధులిచ్చి..

అల్లూరి జిల్లాను ఎందుకు విస్మరించారు ?

-అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా, 25 జిల్లాలకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజనలు నివసిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు నిధులు కేటాయించక పోవడం ఆశ్చర్యంగా ఉందని అనంతగిరి సిపిఎం జెడ్పీటిసి దీసరి గంగరాజు అన్నారు. బుధవారం టోకూరు సర్పంచ్ కిలో మోస్యతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 23న మన పంచాయతీ, మన సాధికారత గ్రామ సభల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల అధికారులు, నోడల్ బృందాలతో అన్ని పంచాయతీ కేంద్రాల వద్ద ప్రజల సమక్షంలో బహిరంగ గ్రామసభలు ఏర్పాటు చేసి, పనులు గుర్తించి ఎసిమేట్లు వేసి నిధులు విడుదలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. దానిని అనుసరించి అల్లూరి సీతారామరాజు జిల్లాను తప్పించి 25 జిల్లాలకు రూ.2,712.50 కోట్లను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి విడుదల చేసిందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రకటన చేశారన్నారు. ఈ నేపథ్యంలో నిధులు విడుదల కావడంతో అన్ని జిల్లాలలో పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాకు మాత్రం నిధులు కేటాయించకుండా, గిరిజనులకు గిరిజన ప్రాంతంలో అభివృద్ధి జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి జిల్లా నుండి విడిపోయి పేదరికంలో కొట్టు మిట్టాడుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు నిధులు కేటాయించకుండా గిరిజనులకు అన్యాయం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. గిరిజనుల హక్కులు, చట్టాలపై దాడి చేస్తూ, నూటికి నూరు శాతం గిరిజనులకు ఉద్యోగాలు ఇచ్చే జివో 3 ను రద్దు చేశారన్నారు. 1/70 చట్టాన్ని, పీసా చట్టాన్ని ఉల్లంఘించి, గిరిజన ప్రాంతంలో గిరిజనులకు రక్షణ లేకుండా చేస్తూనే, మరోపక్క నూటికి నూరు శాతం గిరిజనులు ఉన్న జిల్లా నే టార్గెట్ గా చేసి నిధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా కోటమి నాయకులు గత ప్రభుత్వంలో మంజూరైన నిధులకు శంకుస్థాపనలు, కొబ్బరికాయలు కొట్టడం కాకుండా, నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేక, జ్వరాల బారిన పడినప్పుడు డోలీతో ఆసుపత్రికి తీసుకు వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించకపోతే నిలదీస్తామని హెచ్చరించారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

నిత్యావసర ధరలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కొయ్యూరు

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలపై సిపిఎం ఆధ్వర్యాన కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వై.అప్పలనాయుడు మాట్లాడుతూ నిత్యావసర వస్తువులైన టమాటి, ఉల్లిపాయలు, పప్పులు, కూరగాయలు, నూనెలు ధరలు విపరీతంగా పెరిగి ప్రజలందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రజలు ఆదాయాలు పెరగడం లేదని, దీంతో వారి జీవనం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాఉంలోని కూటమి ప్రభుత్వం అధిక ధరలపై ఎక్కడా మాట్లాడడం లేదని, ప్రజలు బాధలను పట్టినట్లు ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ట్రైకార్ ద్వారా రుణాలు ఇచ్చి యువతను ఆదుకోవాలని, అందరికీ మేకలు గొర్రెలు రుణాలు ఇవ్వాలని, పిఎం జన్‌మన్ పథకం ద్వారా పివిటిజి గ్రామాల్లో అందరికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని, డ్రైనేజీ, అంగన్వాడి, కమ్యూనిటీ బిల్డింగులు, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణమే నిత్యావసరాల ధరలు తగ్గించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గెమ్మెల సోమయ్య, రాజు, రాము, సిద్దు, సన్యాసిరావు, బిరస, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

పెసా చట్టానికి విరుద్ధంగా

మన్యంలో మద్యం దుకాణాల కేటాయింపు

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: పెసా చట్టాన్ని ధిక్కరించి గిరిజన ప్రాంతాల్లో నిర్వహించిన మద్యం దుకాణాల కేటాయింపులను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్స రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పాడేరు జిల్లా కేంద్రంలో బుధవారం సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు కేటాయింపు విధానం ఆదివాసీ చట్టాలను ప్రభుత్వం ఉల్లంఘించిందన్నారు. లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి మద్యం దుకాణాలు కేటాయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కనీసం గ్రామ సభ తో సంప్రదింపులు కూడా లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 వ షెడ్యూల్డ్ ప్రాంతల్లో సుమారు 46 మండలాలు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉందని, మరికొన్ని మండలంలో పాక్షిక ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రకటించిన మద్యం దుకాణాలు కేటాయింపు విధానంలో ఆదివాసీ హక్కులు, చట్టాలను ఉల్లంఘించడం దారుణమన్నారు. పెసా గ్రామ సభ ఆమోదం లేకుండా మద్యం దుకాణాలు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. 2011 లోనే పెసా నిబంధనలు ఉత్తర్వులు జారీ చేసినా ప్రభుత్వం ఉల్లంఘించిందన్నారు. మద్యం దుకాణాలు ఏర్పాటు,లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభ కు మాత్రమే సంపూర్ణ అధికారం ఉందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40 మద్యం దుకాణాలకు సుమారు 1203, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 30 ప్రభుత్వ మద్యం దుకాణాలకు 2400 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో కూడా గిరిజనేతరులు, సిండికేట్‌లు బినామీతో పాటు మైదాన ప్రాంత గిరిజనులతో దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వం పెసా చట్టాలను ఉల్లంఘించడం మద్యం దుకాణాలు కేటాయింపు ప్రక్రియ ప్రారంభించడం అన్యాయం అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.చిన్నయ్య పడాల్, జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు, నాయకులు కిల్లో సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలనర్స

వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నేతలు, హాస్టల్ వర్కర్లు

హాస్టల్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో అవుట్ సోర్సింగ్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియూ ఆధ్వర్యంలో ఏటిడబ్ల్యూఒకి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ హాస్టల్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు సెప్టెంబర్ నెల వేతనం రాలేదని, దీంతో దసరా పండగ రోజుల్లో కూడా వర్కర్లు పస్తులుండే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. మిగిలిన డిపార్టుమెంట్లలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చినట్టే సెలవు రోజుల్లో కూడా జీతాలు ఇవ్వాలని, వారంలో ఒక్క రోజు సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే 4 మండలాలు ఉన్న వర్కర్లతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ అవుట్ సోర్సింగ్ వర్కర్లు దుర్గారావు, వీరయ్య, పుల్లమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అరకు కాఫీ వ్యాపార ప్రగతికి పటిష్ట చర్యలు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అరకు గిరిజన కాఫీ వ్యాపారం పెరగడానికి పటిష్టమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో గిరిజన ప్రాంతంలో పండించే కాఫీకి ప్రత్యేక గుర్తింపు పొందుతోందన్నారు. ఈ ఏడాది ఐటిడిఏ, జిసిసి సంయుక్తంగా 600 టన్నుల పార్చిమెంట్ కాఫీ సేకరణ చేయడానికి సిద్దంగా ఉందన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గిరిజన సహకార సంస్థ, కాఫీ అధికారులు వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవన అధికారులతో కాఫీ విక్రయాలు, మార్కెటింగ్ సదుపాయాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన కాఫీ పళ్లు సేకరించే విధంగా గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. నాణ్యమైన కాఫీ పళ్లు సేకరిస్తే గిరిజన రైతులకు మంచి గిట్టుబాటు ధర పొందడానికి అవకాశం ఉందన్నారు. అధికారులు గిరిజన కాఫీ రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి కృషి చేయాలని చెప్పారు. చింతపల్లి కేంద్రంలో కాఫీ వేలం నిర్వహించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేసారు. కాఫీ రైతులతో రైతు ఉత్పత్తిదారుల ఆర్గనైజేషన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతులు కాఫీ పళ్లను మూడు నాలుగు విడతల్లో సేకరించకుండా ఏడుసార్లు సేకరించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. గిరిజన సహకార సంస్థ, ఐటిడి ఏ సంయుక్తంగా కాఫీ నిల్వ చేయడానికి అవసరమైన గొడౌన్లను గుర్తించాలని అన్నారు. సెర్ప్ మాదిరిగా కాఫీ రైతుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కాఫీ పళ్ల సేకరణలో లైజాన్ వర్కర్లు, మండల ఉద్యానవన అధికారులు భాగ స్వామ్యం ఉండాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో జిసిసి ఎండి కల్పనా కుమారి, ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ పర్చువల్ గాను, కాఫీ సహాయ సంచాలకులు ఎన్. అశోక్, కాఫీ బోర్డు డి.డి. రమేష్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్ .నంద్, మార్కెటింగ్ సహాయ సంచాలకులు రాకేష్, జిసిసి డి.ఎంలు సింహాచలం, దేవరాజ్ తదితరులు పాల్గన్నారు.

మాట్లాడుతున్న పిఒ

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించండి

-ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

ప్రజాశక్తి- అరకులోయ: గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి అవసరమైన కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో కెరీర్ గైడెన్స్ పై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు భవిష్యత్తులో ఏమవుతారోనన్న దానిపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇంజనీర్, డాక్టర్ చదివేందుకు తీసుకోవాల్సిన గ్రూప్‌లపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థల్లో ఎంబీఏ చదివితే ఉన్నతమైన ఉద్యోగాలు సాధించవచ్చని చెప్పారు. బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, ఇంజనీరింగ్, ఎంబిబిఎస్ కోర్సులు చదవడానికి తీసుకోవలసిన సబ్జెక్టులపై తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డీడీ ఎల్.రజిని, ఏటిడబ్ల్యూ ఓలు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో అవసరాలపై నివేదికలు సమర్పించాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి వివిధ సౌకర్యాలు, అవసరాలపై నివేదికలు తయారు చేసి సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్ నుండి బుధవారం పిఒ సింహాచలం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ 104 వాహనాల షెడ్యూల్‌ను ప్రతి నెల సమర్పించాలన్నారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలోని గ్రామాలలో ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజులపాటు వివిధ రకాల వ్యాధులను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని కోరారు. వైద్యాధికారులు, ఎంపిహెచ్‌ఓలు నిత్యం పిహెచ్‌సిల్లో అందుబాటులో ఉండాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జననీ సురక్ష పథకం అమలు తీరుపై ఆరా తీశారు. పిహెచ్‌సిల్లో మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు తీరుపై ఆరా తీశారు. ఏజెన్సీలోని గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలో ఏయే అవసరాలు కావాలో ప్రతిపాదన సమర్పించాలని సంబంధిత అధికారులను కోరారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా వివిధ గ్రామాలలో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి, ఐటీడీఏ పరిధిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఏపీవో జనరల్ డిఎన్‌వి.రమణ, ఏడిఎంహెచ్‌ఒ జి.శిరీషా, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, పీహెచ్‌ఓ చిట్టిబాబు, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, సిడిపిఒ సంధ్యారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి సతీష్, ఎంపిహెచ్‌ఓ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ఎంపిడిఒగా రమేష్‌నాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు నూతన ఎంపిడిఓగా బి.రమేష్ నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రమేష్‌నాయుడు గతంలో సబ్బవరం ఎంపిడిఒగా పని చేసి, బదిలీపై కొయ్యూరు. ఎంపిడిఒగా వచ్చారు. కొయ్యూరులో విధులు నిర్వహించిన మేరీ రోజ్ గొలుగొండ మండల అభివృద్ధి అధికారిగా బదిలీ అయ్యారు.

అల్లూరి పార్కులో చెత్త తొలగింపు

ప్రజాశక్తి-కొయ్యూరు : స్థానిక అల్లూరి పార్కులో చెత్త తొలగింపు కార్యక్రమం పంచాయతీ సర్పంచ్, అధికారులు బుధవారం చేపట్టారు. అల్లూరి పార్కు వద్ద శుభ్రత లేకపోవడంపై ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ మౌనిక, కమల స్పందించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో కలిసి జెసిబి సహాయంతో చెత్తను తొలగించారు. అల్లూరు పార్కు పరిసర ప్రాంతాలు అధికారులు శుభ్రం చేయించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జెసిబితో చెత్త తొలగించిన దృశ్యం

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత ఐవి, సాలిబడప గ్రామస్తులు

సాలిబడపలో పాఠశాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-ఎటపాక : మండలంలోని సాలిబడప గ్రామానికి పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సిపిఎం ఆధ్వర్యాన ఆ గ్రామస్తులు బుధవారం ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా తాము ఇక్కడ నివాసం ఉంటున్నామని, మా గ్రామానికి పాఠశాల, అంగన్వాడి కేంద్రం లేవని దీంతో తమ పిల్లలు చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల లేకపోవడంతో తమ పిల్లలు పశువుల కాపరులుగా, కూలీలుగా మారుతున్నారని పేర్కొన్నారు. 30 సంవత్సరాలుగా స్కూల్ లేకపోవడం వల్ల ఇప్పుడు 25, 30 ఏళ్ల వయసు ఉన్న వాళ్లంతా కూలి పనులు చేయడం, ఇతర ప్రాంతాలకు వలస కూలీలుగా వెళ్లిపోవడం చేస్తున్నట్లు చెప్పారు. చదువులకు దూరంగా తమ జీవితాలు ఉన్నాయని, మా భవిష్యత్తు తరాల వారికి చదువు అందించాలని, అందుకు పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, సాలిపడప గ్రామస్తులు పాల్గొన్నారు.

నిందితులు వంతల జయసేన్, పరుశురాం, దాసు

ఎఎస్ఐ మృతి కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- మోతుగూడెం : అడవి జంతువులను వేటాడడం కోసం వేసిన కరెంటు ఉచ్చు తగిలి సిఆర్పిఎఫ్ ఎఎస్ఐ పి.తిరునావుకరసు మృతి చెందిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. చింతూరు ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా తెలిపిన వివరాలు ప్రకారం... డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధి, మెట్టగూడెం గ్రామ పైవీధి శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో అడవి జంతువులను వేటాడడం కోసం కరెంటు ఉచ్చు వేశారు. ఈ నెల 6న ఆదివారం సిఆర్‌పిఎఫ్ పార్టీ కూంబింగ్ నిర్వహిస్తుండగా, సిఆర్పిఎఫ్ ఏఎస్ఐ పి.తిరునావుకరసుకు కరెంట్ ఉచ్చు తగలడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈ కేసును విచారించిన చింతూరు సిఐ టి.దుర్గాప్రసాద్, డొంకరాయి ఎస్సై శివ కుమార్, సిబ్బందితో కలిసి నిందితులుగా గుర్తించిన మెట్టగూడెం గ్రామానికి చెందిన వంతల జయసేన్, కిలో పరుశురాం, కిలో దాసులను అరెస్టు చేశారు. సంఘటన జరిగిన వెంటనే నేర స్థలంలో ఉన్న సాక్షాధారాలను మాఫీ చేసి నిందితులు పరారైనట్లు ఎఎస్‌పి తెలిపారు. మెట్టగూడెం అటవీ ప్రాంతంలో 6.3 కెవి విద్యుత్ లైన్‌కి కరెంటు ఉచ్చు బిగించి ఎన్నోసార్లు నిందితులు అడవి జంతువులను వేటాడినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కరెంటు ఉచ్చు వేయడానికి ఉపయోగించిన సర్వీస్ వైరు, వెదురు బొంగు కర్రలు, గెడ బొంగు, ఐరన్ బైండింగ్ జి వైర్, ప్లాస్టిక్ గొట్టాలను నిందితులు, వారి ఇంటి వద్ద పొదల్లో దాచిపెట్టగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా ఉండేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కరెంటు ఉచ్చులు ఎక్కడైనా తారసపడితే పోలీసులకు చెప్పాలని, కరెంటు ఉచ్చు వేస్తున్నట్లు ఎవరి మీద అయినా అనుమానం ఉంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కి తెలియచేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తహశీల్దార్‌గా సూర్యారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి తహశీల్దార్‌గా కె.సూర్యారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యనారాయణ కోనసీమ జిల్లా నుండి సాధారణ బదిలీపై రాజవొమ్మంగి తాహశీల్దార్‌గా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన తహశీల్దార్ కరక సత్యనారాయణ దేవీపట్నం మండల తహశీల్దారుగా బదిలీపై వెళ్లారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన తాహశీల్దార్ సూర్యారావును కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

హోటళ్ల యజమానులు నిబంధనలు పాటించాలి : పిఒ

ప్రజాశక్తి- అరకులోయ :పర్యాటక ప్రాంతంలో హోటళ్ళు, రెస్టారెంట్లు నిర్వహిస్తున్న యజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందేనని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ స్పష్టం చేసారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ స్టేక్ హోల్డర్లతో నిర్వహించిన సమావేశంలో పిఒ మాట్లాడుతూ, పర్యాటకులను ఆకర్షించే విధంగా హోటళ్లు, రెస్టారెంట్లలో సౌకర్యాలు కల్పించాలన్నారు. నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైన రిజిస్ట్రర్లు నిర్వహించాలని, సిసి కెమెరాల భద్రత ఉండాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని, స్థానిక 16 రకాల గిరిజన ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని నిలిపివేయాలన్నారు. వంటగది ప్రాంతాలు, భోజన స్థలాలు, రెస్ట్ రూమ్ సౌకర్యాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఐదేళ్ల కాలంలో కొన్ని ప్రాంతాలలో క్యాంపింగ్ టెంట్ వసతి పెరిగిందని వీటిలో సరైన ప్రభుత్వ అనుమతులు లేకుండానే జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అన్ని క్యాంపింగ్ సైట్లు తప్పనిసరిగా ఎంపీడీవో వద్ద రిజిస్టర్ చేయాలని స్థానిక నిబంధనలకు అనుగుణంగా మాత్రమే నిర్వహించాలని సూచించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో గదుల సంఖ్య , విండు, కన్వెన్షన్ హాల్ కెపాసిటీకి తగినంత ఉండాలన్నారు. రేట్లు, గది అద్దెలు కౌంటర్ ముందు ప్రదర్శించాలన్నారు. అన్ని పర్యాటక ప్రదేశాలలో అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేసి వీడీవీకే ఉత్పత్తులను ప్రోత్సహించడంతో పాటు, మార్కెటింగ్ సౌకర్యం అందించాలన్నారు. లాడ్జీల్లో, టెంట్ల వద్ద బస చేసే పర్యాటకుల ఆధార్ కార్డులు, పూర్తి వివరాలు విధిగా తీసుకోవాలని పీవో సూచించారు. పర్యాటకులతో స్నేహపూర్వకంగా మెలగాలని ఆయన అన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి టెంట్ కి నాలుగు నెలలకు సంబంధించి రూ.500 రూపాయలు చొప్పున ఆయా పంచాయతీలకు ముందుగానే చెల్లించాలని స్పష్టం చేశారు. క్యాంపింగ్ టెంట్ల నిర్వాహకులు డీజే వంటి సౌండ్ సిస్టంలు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాడవద్దని ఆదేశించారు. అరకులో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ పివిఎస్ ప్రభాకరరావు, జిల్లా పంచాయతీ అధికారి బి. లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్, ఎంపీడీవో లవరాజు, ఎస్సై గోపాలరావు, వివిధ హోటళ్ళ, రిసార్ట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం

అరకులోయ :మండలంలోని మాదగడ గ్రామంలో రక్షిత మంచినీరు, పారిశుధ్యం వంటి సౌకర్యం కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదగడ గ్రామంలో కలుషిత నీరు తాగడంతోనే గ్రామానికి చెందిన పలువురు వాంతులు విరేచనాలతో బాధపడుతూ ఏరియా ఆసుపత్రిలో చేరారన్నారు.గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని, డ్రైనేజీ వ్యవస్థ పారిశుధ్య మెరుగు పర్చాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి బుచ్చిబాబు, సత్యారావు, తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: పీఎం జన్మన్ గృహ నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి బాబు నాయక్ చెప్పారు. బుధవారం అంత్రిగుడ పివిటిజి గ్రామంలో నిర్మించిన ఆయన పీఎం జన్మన్ గృహ నిర్మాణ పథకంపై పివిటిజి గిరిజనులకు అవగాహన కల్పించారు. నూతన గృహ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 730 గృహాలు మంజూరు కాగా మొదటి విడతలో 432 నిర్మాణాలు, రెండో విడతలో 70, మూడో విడతలో 9 చొప్పున నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. నిరుపేద గిరిజనులకు ఒక గృహానికి రూ.2.39 లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిఎఫ్‌డిసి డివిజనల్ మేనేజర్‌కు సమ్మె నోటీస్

ఎపిఎఫ్‌డిసి డివిజనల్ మేనేజర్‌కు సమ్మె నోటీసును అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ కార్మికుల డిమాండ్లను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు డిమాండ్ చేసింది. కాఫీ కార్మికుల డిమాండ్లపై బుధవారం ఏపీఎఫ్‌డిసి డివిజనల్ మేనేజర్‌కు కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కాఫీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.సుందర్రావు మాట్లాడుతూ, సమ్మె నోటీసుపై యాజమాన్య తక్షణమే స్పందించకపోతే ఏ క్షణంలోనైనా కాఫీ కార్మికులు సమ్మె చేపట్టడం ఖాయమన్నారు. బుధవారం పాడేరు డివిజనల్ మేనేజర్ కృష్ణబాబు కి డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును కార్మిక సంఘం తరపున అందజేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్, సుందర్రావు మాట్లాడుతూ, కాఫీ కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. 2002 సంవత్సరంలో రోజువారి కూలీలు నెలకు 1500 మంది పని చేసే వారిని, ప్రస్తుతం 500మంది కూడా నెలకి రోజు కూలి దొరకడం లేదన్నారు. దీనిని బట్టి కాఫీ తోటల పరిస్థితి ఎంతో అర్థమవుతుందన్నారు. గత 15 సంవత్సరాల నుంచి ప్లాంటేషన్ కండక్టర్ (పిసి) రెగ్యులర్ ఉద్యోగులు రిటైర్మెంటయితే ఆ స్థానంలో కొత్త ఉద్యోగులను నియమించలేదని, దీంతో, తోటల పర్యవేక్షణ కరువైందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది 300 మందిని నియమిస్తే తప్ప, తోటల సంరక్షణ సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం 10 వేల ఎకరాలకు 18 మంది క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రమే పర్యవేక్షణలో తోటలు రక్షణ జరుగుతుందని తెలిపారు. దీంతోపాటు అతి తక్కువ జీతాలు ఇస్తున్నారన్నారు. కరువు భత్యం(డిఎ) పాయింట్లకు అనుగుణంగా కార్మికుల కూలి రేట్లు పెంచవలసి ఉందని తెలిపారు. మంచినీరు సౌకర్యం కల్పించాలని, పండగ అడ్వాన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే యాజమాన్యమే మెడికల్ ఖర్చులు భరించాలని అగ్రిమెంట్లో ఉన్నప్పటికీ అమలు కావటం లేదని తెలిపారు. పర్మినెంట్ కార్మికులకు నెలలో 26 రోజులు కచ్చితంగా పని దినాలు కల్పించాలన్నారు. ప్రతి డివిజన్ పరిధిలో ఒక ఎఎన్ఎంను నియమించి ప్రమాదాలకు గురైతే ప్రాథమిక చికిత్స అందించాలని కోరారు. ఈ సమస్యలపై యాజమాన్యం దిగివచ్చి కార్మికులతో చర్చించాలని, లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కార్మికులు సుందర్‌కుమార్, రామారావు, సిద్దు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

డయేరియా రోగులకు...
మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలం మాడగడ గ్రామంలో 12 మంది డయేరియా సోకి అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మరో ఇద్దరు కెజిహెచ్ లో ఉన్నారని, తక్షణం వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరావు, మండల కార్యదర్శి సభ్యులు కుర్ర మగ్గన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, మాదగడ గ్రామంలో 12 మంది డయేరియా వ్యాధిలో బాధపడుతుంటే వైద్య సిబ్బంది ఎందుకు పట్టించుకోలేదన్నారు. గ్రామంలో వైద్య సిబ్బంది పర్యటించి తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

'పల్లె పండగ'తో గ్రామాలాభివృద్ధి

కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రజా ప్రతినిధుల సహకారంతో జిల్లా అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం పాడేరు మండలం గొండెలి, ఇరడాపల్లి పంచాయతీ లాడాపుట్టు గ్రామాల్లో పర్యటించి పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలలో గ్రామ తీర్మానాల ద్వారా గుర్తించిన అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పల్లెలలో పండుగ వాతావరణం కనిపిస్తోందన్నారు.ఈ సందర్భంగా పలు అభివద్ధి పనులకు కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఇరడాపల్లి పంచాయతీకి కావలసిన పనుల వివరాలు తెలుసుకొని వాటి మంజూరుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. గొండెలి గ్రామంలో ప్రతి రైతు ఇ- క్రాప్‌ను నమోదు చేయించుకోవాలని సూచించారు. తద్వారా వైపరీత్యాలతో నష్టపోతే ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంప్రదాయ పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మన జిల్లాలో అధిక శాతం పంటలు ఎరువులు లేకుండా పండిస్తున్నందున మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులు పంటను అధిక లాభాలకు అమ్ముకునే విధంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయాదికారి ఎస్‌బిఎస్ నంద్, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పలువురు మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: పల్లె పండగ వారోత్సవాలతో గ్రామాలలో సమస్యలు పరిష్కారం అవుతాయని కిటుముల సర్పంచ్ గేమ్మెల రమణమ్మ అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ వారోత్సవాలలో భాగంగా కిటుముల పంచాయతీలోని భీముని శత్రు గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె నీటి తటాకానికి (చిన్న చెరువు)కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలలో అవసరమైన పనులకు సంబంధించి తీర్మానాలు చేసుకోవడంతో గ్రామాలు అభివృద్ధి పరచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోన శివ, వార్డు సభ్యులు గడుతూరి రాధాకృష్ణ, వైకాపా సీనియర్ నాయకుడు, ట్రైకార్ మాజీ డైరెక్టర్ సుర్ల లోవరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లోచల సత్యనారాయణ పాల్గొన్నారు.

అనంతగిరి:మండలంలోని బొర్రా పంచాయితీలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ జన్ని అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన జడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, బొర్రా గేటువలస నుండి ఎగువమామిడి వరకు గతంలో మంజురైన 6 లక్షల నిధులతో శంకుస్థాపన చేసి సి.సి రోడ్డు నిర్మాణం ప్రారంభించడం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, బొర్రా మాజీ సర్పంచ్ ప్రసన్న, లాయర్ సోమెల రాంబాబు, పంచాయితీ రాజ్ ఇంజనీర్ సాయి విజాయ్, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎపిఒ సన్యాసి నాయుడు టి.ఎ.సింహాద్రి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పైడితల్లి పాల్గొన్నారు

కొయ్యూరు : మండలంలోని డౌనూరు పంచాయతీ పరిధి తులబాడ గ్రామంలో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.2 లక్షలతో సాయిల్ అండ్ మయిస్టర్ కన్సర్వేషన్ (ఎస్ఎంసి) ట్రెంచెస్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, సర్పంచ్, ఎంపీటీసీ, కూటమి నాయకులు జగన్, రాజుబాబు, దేవి పాల్గొన్నారు.

పల్లె పండగను బహిష్కరిస్తాం

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్: మండలంలోని పినకోట, జీనబాడు, పెద్దకోట, చివర్ల పంచాయతీల్లో పల్లె పండుగ బహిష్కరిస్తున్నట్టు ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, గ్రామ పరిశుభ్రతను పాటించాలని చేపట్టినటువంటి కార్యక్రమంలో తమ నాలుగు పంచాయతీలకు నిధులు కేటాయించడంలో సవతి తల్లి ప్రేమను చూపించారని తెలిపారు. పంచాయతీలకు కనీసం లక్ష రూపాయలు కూడా కేటాయించక పోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. పాలన అనేది పార్టీలకు అతీతంగా ఉండాలని వారు కోరారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళన చేపడతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైసీపీ సర్పంచులున్న పంచాయతీలకు పల్లె పండుగలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరగిరి మండలం బొర్ర పంచాయతీలో 'పల్లె పండగ'

గుంతలతో నిండిన శ్రీరామగిరి రహదారి

అధ్వానంగా శ్రీరామగిరి రహదారి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలో వరదలు మూడుసార్లు రావడంతో రహదారులన్నీ గోతుల పడి వాహనాలు తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. రెండో భద్రాద్రిగా పేరుపొందిన శ్రీరామగిరి పుణ్యక్షేత్రానికి వెళ్లాలంటే ఆ రహదారి అధ్వానంగా మారింది. దీంతో పాపికొండలు వెళ్లే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సహజంగా పాపికొండలకు వెళ్లే పర్యాటకులు శ్రీరామగిరి పుణ్యక్షేత్రాన్ని దర్శనం చేసుకొని అప్పుడు పాపికొండలు ప్రయాణిస్తారు. కాని రహదారి గోతులమయం కావడం, తోటపల్లి నుండి సీతంపేట వెళ్లే మధ్యలో వంతెన వరదలకు క్రుంగిపోవటంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే ప్రభుత్వం చొరవ చూపి పాత వంతెన స్థానంలో కొత్త వంతెన మంజూరు చేసి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి, అడవి వేట అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు : గంజాయి సాగు, క్రయ విక్రయం, రవాణా వల్ల, అడవి జంతువుల వేట వల్ల జరిగే అనర్థాలపై మండలంలోని నిమ్మలపాలెం గ్రామంలో కొయ్యురు సీఐ పి.వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, క్రయ, విక్రయం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠినమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. గంజాయి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలన్నారు. అడవి జంతువుల వేటలో భాగంగా వరి పొలాలు, అటవీ ప్రాంతాల్లో కరంటు తీగలు ఏర్పాటు చేయడం నేరమని చెప్పారు. అనంతరం కొయ్యురు ఎపిటిడబ్ల్యుఆర్ పాఠశాలను సందర్శించి పై అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జున, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో దుర్గాదేవి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో కాళికాదేవి వేషధారణలో చేసిన వినూత్నమైన నృత్యాలు పలువురుని ఆకర్షించాయి. దుర్గాదేవి అమ్మవారిని మెయిన్ బజార్ నుంచి థింసా నృత్యాలు, కుర్రకారులు డాన్సులు, బాణసంచాతో పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. కీర్తిశేషులు సదరం సుబ్రహ్మణ్యం పేరుమీద అమ్మవారికి సమర్పించిన పట్టుచీరను లాటరీ పద్ధతిలో దుర్గా వేదిక చెందిన అంజిత్ అనే యువకుడు దక్కించుకున్నాడు.

3 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-మోతుగూడెం : అల్లూరి జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్ పోస్టు వద్ద పోలీసులు మూడు కేజీల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం... డొంకరాయి ఎస్సై శివకుమార్, పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఒరిస్సా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ నుండి ఒక బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వస్తుండగా, పోలీసులు వారిని ఆపి తనిఖీ చేయగా, వారి వద్ద 3 కేజీలు గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గెజిటెడ్ అధికారి అయిన లక్కవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి జివి.నానాజీ సమక్షంలో విచారణ చేపట్టగా నిందితులు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన భీమాకడ, త్రినాథ్ కడ, ఇంతులూరువాగుకు చెందిన కిలో పరమేష్‌లుగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు.

రూ.కోటి విలువైన పల్లాడియం స్వాధీనం

ప్రజాశక్తి - అనకాపల్లి : సుమారు కోటి రూపాయల విలువైన పల్లాడియంను స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను పరవాడ పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి దీపిక బుధవారం ఎస్‌పి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 9న రవీంద్ర హీరేయస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న చింతకాయల రాజు, ముద్దనూరు వినీత్ వర్మ, చింతకాయల మురళి, కనుమూరి రామచంద్రరాజు కంపెనీలో కార్బన్ ఉత్ప్రేరకాలను సపోర్టు చేసే రూ.కోటీ 15 లక్షల విలువైన నాలుగు కిలోల 2 గ్రాముల పల్లాడియంను ప్రొడక్షన్ బ్లాక్‌లో డ్రైయర్‌లో ఆరబెట్టడాన్ని గమనించి మారు తాళాలతో దొంగిలించారు. దీంతో కంపెనీలో పనిచేసే టెక్నికల్ డైరెక్టర్ ఎస్.వరదరాజన్ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌పి దీపిక ఆదేశాలతో అదనపు ఎస్‌పి క్రైమ్స్ ఎల్.మోహన్‌రావు, పరవాడ డిఎస్‌పి కెవి.సత్యనారాయణల పర్యవేక్షణలో రంగంలోకి దిగిన పరవాడ పోలీస్ సిబ్బంది ఈ నెల 15న పరవాడ మండలం తానాం శ్మశాన వాటిక వద్ద పల్లాడియంను విక్రయించేందుకు రిసీవర్ల కోసం చూస్తున్న నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి కోటీ 15 లక్షల రూపాయల విలువైన నాలుగు కిలోల 110 గ్రాముల పల్లాడియంను, పల్సర్ బైక్‌ను, మారు తాళం చెవిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై నిందితులను విచారించగా ఈ నెల 5న దొంగతనానికి ప్రణాళిక వేసినట్టు అంగీకరించారు.

నలుగురు నిందితుల అరెస్ట్

ఈ సందర్భంగా ఎస్‌పి దీపిక విలేకరులతో మాట్లాడుతూ ఫార్మా కంపెనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని, మరమ్మతులకు గురైతే వెంటనే సరి చేయించుకోవాలని తెలియజేశారు. నాలుగు రోజుల్లో కేసును ఛేదించిన పరవాడ ఇన్‌స్పెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, సిసిఎస్ ఎస్ఐ పి.రమేష్, పరవాడ పోలీస్ స్టేషన్ సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్టు ఆసుపత్రిని ప్రైవేట్ వారికి అప్పగించడం కోసం ప్రీ బిడ్డింగ్ సమావేశం నిర్వహించడం దుర్మార్గమంటూ విశాఖపట్నం పోర్టు ఎబి వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.జగన్, హెచ్ఎంఎస్ నాయకులు మంగయ్య నాయుడు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పోర్టులో వచ్చిన లాభాలతో పోర్టు ఏర్పడిన తర్వాత 50 ఏళ్లు అయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ఏర్పడిందన్నారు. హాస్పటల్ ఏర్పాటులో కార్మికుల రక్తపుబొట్లు ఉన్నాయన్నారు. 40 వేల మంది ఆరోగ్యాలను ప్రైవేట్ వాళ్లకి ఇవ్వాలన్న కేంద్ర బిజెపి విధానం అత్యంత దుర్మార్గమైనదన్నారు. పోర్టు ఏర్పడిన నుంచి ఈ రోజు వరకు లాభాల్లోనే నడుస్తోందని, వేల ఎకరాల భూమి ఉందని, రిజర్వ్ ఫండ్స్ ఉన్నాయని తెలిపారు. అయినా ప్రైవేటు వారికి హాస్పిటల్‌ను ఇవ్వడం సరికాదన్నారు. యాజమాన్యం తన ఆలోచనను విరమించుకోకుంటే జిల్లాలో ఉండే కార్మిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అవసరమైతే పోర్టు చైర్మన్ ఆఫీస్‌ను ముట్టడిస్తామన్నారు. తాము ధర్నాకు పిలుపు ఇవ్వడంతో యాజమాన్యం వెంట వెంటనే బుధవారం 12 గంటలకే అఖిలపక్ష కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయడం ధర్నా జరగకుండా చేయాలని పన్నిన కుట్రలో భాగమేనన్నారు. అయినప్పటికీ కార్మికులు ధర్నాలో పాల్గొన్నారని తెలిపారు.

కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.లక్మణరావు, సాంబమూర్తి, రామలింగేశ్వరరావు, లక్ష్మణ్, శంకర్రావు, ఎఐటియుసి నాయకులు శంకరన్, రమణ బాబు, హెచ్ఎంఎస్ నాయకులు అంజి, ఐఎన్‌టియుసి నాయకులు చందు, సిఎఫ్‌టియు నాయకులు మూర్తి, బిఎంఎస్ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు. యాజమాన్యం నిర్వహించిన సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొని హాస్పిటల్‌ను ప్రైవేటుపరం చేయొద్దని, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని కోరాయి.

నర్సుల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపి ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం కెజిహెచ్ క్లాక్ రూమ్‌లో కోలాహలంగా చేపట్టిన కార్యక్రమంలో నామినేషన్లను అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావు స్వీకరించారు. మొత్తం ఓటర్లు 555కాగా అందులో ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత ఉన్నవారు 25 మంది కెజిహెచ్‌లో ఉన్నారు. ఈ ఎన్నికలలో రెండు ప్యానెల్స్ పోటీలో ఉన్నాయి. తొలిసారి అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, ఉపాధ్యక్ష పదవితో పాటు ఐదుగురు పాలకవర్గ సభ్యులను సైతం ఎన్నుకోవాల్సి ఉంటుంది. గురువారం నామినేషన్ల పరిశీలన, శుక్రవారం ఉపసంహరణ ఉంటాయని, ఈ నెల 23న ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి తెలిపారు. కార్యదర్శి పదవికి 3 నామినేషన్లు వచ్చాయని, మిగిలిన అన్ని పోస్టులకు రెండేసి చొప్పున నామినేషన్లు వచ్చాయని వెల్లడించారు.

పిఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఎం.శ్రీభరత్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జోన్ 4 కార్యాలయంలో పిఎం విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ సంప్రదాయ వృత్తులు నిర్వహించే వారికి చేయూతనిచ్చి, ప్రోత్సాహం అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న మలబార్ విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం తీరంలో మలబార్ - 2024 సీ ఫేజ్ విన్యాసాలు బుధవారమూ కొనసాగాయి. ఆస్ట్రేలియా, భారత్, జపాన్, అమెరికా దేశాలకు చెందిన నావికాదళ యుద్ధనౌకలు, హెలికాప్టర్లు, సముద్ర గస్తీ విమానాలు బంగాళాఖాతంలో జరిగిన విన్యాసాల్లో పాల్గొన్నాయి. తాజా యుద్ధ విన్యాసాల్లో మున్ముందు భారత నౌకాదళ జలాంతర్గాములు కూడా పాల్గొంటాయని, వివిధ దేశాల ప్రత్యేక దళాల సంయుక్త విన్యాసాలు కూడా ఈ ఫేజ్‌లో ఉంటాయని వెల్లడించారు.

పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్‌లో మీనా కుమారి సత్తా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డెహ్రాడూన్‌లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్ పోటీలలో బిఎస్ఎన్ఎల్ విశాఖ జిల్లాకు చెందిన మీనా కుమారి సత్తా చాటారు. రెండు ఈవెంట్లలో ఆమె ద్వితీయ స్థానంలో నిలిచి పథకాలు సాధించారని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి పిఇసిహెచ్‌వి.సాగర్ మీడియాకు తెలిపారు. మీనా కుమారి 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, అలాగే లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారని వెల్లడించారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ మహిళా విభాగం కార్యదర్శిగా ఉన్న మీనా కుమారి జాతీయ స్థాయిలో ఇటువంటి ప్రతిభను కనపరచడం హర్షించదగిన విషయమని, తమ యూనియన్‌కు ఎంతో గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఎత్తైన కొండలను కమ్మేసిన మంచు దుప్పటి

పాలసంద్రంగా మంచు అందాలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్లో బుధవారం మంచు అందాలు పాల సముద్రాన్ని తలపించాయి. ఈ మంచు అందాలు పర్యాటకులను మైమరిపించాయి. దారకొండ దారాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో ఎత్తైన కొండల నడుమ మంచు అందాలు పలువురిని ఎంతగానో ఆకర్షించాయి. ప్రతి ఏడాది కార్తీక మాసం ప్రారంభం నుంచి డిసెంబర్ చివరి వరకు పర్యాటకులు తండోపు తండాలుగా వస్తుంటారు. అటువంటిది ముందుగానే దారకొండ ఘాట్ రోడ్లో ప్రకృతి నడుమ దర్శనమిస్తున్న సోయగాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో అందచందాలు జలపాతాలు ఆస్వాదిస్తూ ఎంతో అనుభూతిని పొందుతున్నారు.

చట్టం ప్రకారం మద్యం షాపులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజన ప్రాంతంలో పీసా చట్టం ప్రకారం మద్యం దుకాణాలను మంజూరు చేయాలని కోరుతూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో మద్యం షాపుల మంజూరు విషయంలో ఇక్కడ వర్తించే పంచాయితీ రాజ్ చట్టం (పీసా) నిబంధనల ప్రకారం గ్రామసభల తీర్మానం అవసరం ఉందని పేర్కొన్నారు. పీసా చట్టం నిబంధనలు పాటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేపైనా ఉందని చెప్పారు. ప్రభుత్వం కూడా 1వ సూచికలో కచ్చితంగా గ్రామసభల ఆమోదం తర్వాత మాత్రమే మద్యం షాపులను మంజూరు చేయాలని సూచించిందని పేర్కొన్నారు. కాని ఎక్సైజ్ అధికారులు, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఈ నిబంధనలకు విరుద్ధంగా గ్రామసభల తీర్మానం లేకుండానే లాటరీల ద్వారా ఆయా షాపులకు లైసెన్సులను మంజూరు చేశారని తెలిపారు.

సాంకేతిక సమస్యలతో బిఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధి సప్పర్లలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌లో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో సెల్ సేవలు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. 45 రోజుల నుంచి సెల్ టవర్ పని చేయకపోవడంతో సమాచార వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సచివాలయంలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. అత్యవసర సమయంలో సెల్‌ఫోన్ ద్వారా ఇతరులకు సమాచారం చేర వెయ్యాలన్న బంధుమిత్రులతో మాట్లాడాలన్నా ఇటు దారకొండ, అటు జీకే వీధి 15 కిలోమీటర్లు వినియోగదారులు రావలసి వస్తుంది. దీంతో అనేక ఇబ్బందులు గురవుతున్నారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సాంకేతిక లోపాలు సరిచేసి సెల్ సేవలు ఇంటర్నెట్ సేవలు వినియోగంలో తేవాలని వినియోగదారులు డిమాండ్ చేశారు.

మాదిగమల్లులో రచ్చబండ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ మాదిగ మల్లు గ్రామంలో రచ్చబండను ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ గ్రామస్తులు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్య వచ్చిన ఐక్యంగా పరిష్కరించుకోవడానికి రచ్చబండ లేకపోవడంతో గ్రామ సమీపంలో ఉన్న రాళ్లపై కూర్చొని చర్చించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. రచ్చబండ ఏర్పాటు చేయమని అనేకసార్లు అధికారులకు, గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచుకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మాదిగ మల్లు గ్రామానికి రచ్చబండ ఏర్పాటు చేయాలని కోరారు.